రామారావు పంచె కొసతో కళ్ళు తుడుచుకున్నాడు.

క్రితంరోజు సాయంకాలం నుంచి అతన్ని ఒకటే ప్రశ్న ముల్లులా పొడుస్తున్నది. జోగయ్య తనతో చెప్పకుండా ఎందుకలా వెళ్ళిపోయాడు ?

జోగయ్య తన మిత్రుడు. ప్రాణంలో ప్రాణం. వాడి మనసులో ఏదున్నా, వాడేం చేసినా తనతో చెప్పకుండా ఉండలేడు. అలాగే తనూను. పదో ఏట కాబోలు జత పడిన తమ స్నేహం అలా అలా బిగుసుకుపోయింది. నిన్న ఉదయం దాకా ఈ స్నేహపు వారధికి చెలియలికట్ట పడలేదు. ఒకటా రెండా? నలభై అయిదేళ్ళయి కొనసాగుతోంది తమ స్నేహం. ఇన్నాళ్ళూ ఆత్మబంధువుకంటే దగ్గరగా ఉండి ఇప్పటికిప్పుడు 'నువ్వెవరో నేనెవరో సుమా!' అన్నట్టుగా పారిపోయేడు.

వెదికి తీసుకువచ్చి ఒకసారి గట్టిగా చెవి మెలేసి సంజాయిషీ అడగడానికేనా వీలు కానంత దూరం పారిపోయేడు జోగయ్య.

రామారావు నీరసంగా అరచేతులు నలుపుకున్నాడు. కుర్చీలో వెనక్కి చేరబడి కళ్ళు మూసుకున్నాడు. లభ్యంకాని పని గురించి విచారించేకంటే, తనకందుబాటులో ఉన్న స్నేహపు డబ్బీని తెరిచి అందులో పరిమళాల్ని వాసన చూడటమే యుక్తంగా తోచింది.

.....'నేనివాళ బళ్ళోకి వెళ్ళనే అమ్మా' అని గునుస్తున్న రామారావుని 'ఏమయిందిరా నీకు?' అని అడిగింది తల్లి.

'నాకివాళ చాలా జ్వరంగా ఉందే'.

'అలాగరా, నాయనా' అని కొడుకు నుదుటిమీదా, బుగ్గలమీదా చెయ్యివేసి చూసిందావిడ. ఆవిడకి సంగతి అర్థమైపోయింది.

ఆరోజు రామారావు స్నేహితుడు జోగయ్య పంతులు, పండక్కి వాళ్ళ అక్కా బావా వచ్చేరని బడి మానేసి ఇంట్లో కూర్చున్నాడు. 'పండగ ఇంకా అయిదు రోజులుంది కదా. ఇవాళనుంచే శెలవు పెట్టేవెందు'కని రామారావు మిత్రుణ్ణి అడిగేడు.

'ఇవాళ ఒకరోజే మానేశాను బడి. రేపట్నుంచి వస్తాన్లే. నువ్వెళ్ళవేంటి ?' అన్నాడు జోగయ్య.

'ఎందుకు వెళ్ళనూ ? నాకే అక్కా బావలున్నారేమిటి పండక్కి రావడానికి, నేను బడిమానేయడానికీ.' అని దిగులుగా చూసేడు రామారావు. మిత్రుని చూస్తే జోగయ్యకేమిటో కష్టమనిపించింది.

'పోనీ, నువ్వూ బడిమానేయి ఇవాళ. మనిద్దరం మా ఇంట్లోనే ఆడుకుందాం, ఏం?'

అదీ రామారావు 'జ్వరానికి కారణం. ఒకరు బడిమానేస్తే మరొకరు మానే

యాలి. ఒకరికి వంట్లో నలతగా ఉంటే మరొకరు నలతని కొనితెచ్చుకుంటారు. అదో ముచ్చట..............!

ఏదో పనిమీద ఆగదిలోకి వచ్చి, పడక కుర్చీలో కళ్ళుమూసుకు కూర్చున్న తండ్రి పెదిమల మీద చిరునవ్వుని చూసి తెల్ల పోతూ వెళ్ళిపోయేడు రామారావు.

......'ఏరా రావుడూ ఇంకా కాలేజీకి టైమవలా?'

'అయింది నాన్నా.'

'మరి ఆగిపోయావేం?'

'ఇంగ్లీషు టెక్స్టు కొనాలినాన్నా'.

'అదేవిటూ? క్రిందటివారంలో కొన్నావ్?'

'అది పోయింది. క్లాసులో ఇంట్లో కూడా వెతికేను. కనిపించటం లేదు.' కొద్దిసేపు రామారావు మొహంలోకి చూసి మౌనంగా డబ్బు తెచ్చి ఇచ్చేడు తండ్రి.

పుట్టిన ఒక్కడూ తమవల్ల ఏలోటూ భరించటం ఇష్టం లేదాయనకి.

ఆరోజే జోగయ్యకి కొత్త ఇంగ్లీషు పుస్తకం తెచ్చి ఇచ్చేడు రామారావు.

జోగయ్య కళ్లలోకి అదివరకు లేని కాంతి వచ్చింది.

'ఇంక లెక్చరర్‌గారి బోరు నీకు తప్పి పోతుందనుకుంటాను' అన్నాడు నవ్వుతూ. జోగయ్య మిత్రుడి రెండు భుజాలమీద ఆప్యాయంగా చేతులువేసి నొక్కాడు.

'వాడేకాదు. ఇంట్లో కూడా ఇహ ఎవ రికీ భయపడక్కర్లేదు. నీకు చెప్పాకే గాని, అసలు జీతం కట్టేసరికే తల ప్రాణం తోకకి వస్తోంది. కొన్న పుస్తకాలు కూడా పోతుంటే నాన్న ఏమంటారో అని హడలి చచ్చేననుకో! నువు దేవుడిలా ఆదు కున్నావు గనక సరిపోయింది.......' కృత జ్ఞత నిండిన కళ్లతో చూసేడు జోగయ్య.

'ఒరే నేను దేవుణ్ణికానురా,నీరామారావుని!'

'పోనీ అలాగే అనుకో.'

పుస్తకం కొనగా మిగిలిన చిల్లరడబ్బు లతో హోటల్‌కి వెళ్లేరు మిత్రులిద్దరూ. ఈ ఉపకారాన్ని మర్చిపోలేదు జోగయ్య. తల్లిదండ్రులు అవకాశం ఇచ్చినంతమట్టుకు సంతృప్తిపడి ఇంటరుతో చాలించి ఉద్యోగాల్లో ఐ్రరలు దూర్చేరు ఇద్దరూ.

జోగయ్య సైన్సు పరీక్షకట్టి పాసయి గవర్నమెంటు ఆఫీసులో టైపిస్టు, రామారావు టీచరు ట్రెయినింగు అయి మేస్టరు గిరిలో కుదురుకున్నారు.

పెళ్లిళ్లయ్యేయి. సంసారాలు, వాటితో బాధ్యతలూ, బరువులూ పెరిగేయి. బాదర బందీలు ఎలావున్నా వాళ్ళు ఒకరిని ఒకరు ఏ నిముషం ఏమరిచి వుండేవాళ్ళు కారు. రామారావు అరికాల్లో ముల్లు విరిగితే జోగయ్య ప్రాణం విలవిలలాడేది. జోగయ్యకి ఒకనాడు జ్వరంవస్తే ఆరో జంతా రామారావు బడికి శెలవు పెట్టేసి మిత్రుడి దగ్గరే కూర్చున్నాడు.

పనుల్లోకి వెళ్లి వచ్చేక సాయంకాలం పార్కులోనో, ఈశ్వరుడి గుడిమండపం లోనో చేరి పోతారు ఇద్దరూ. రోజూ కలుసుకునే వాళ్లకి మాటలేముంటాయి. సంసారాలు—లేమి—ధరలు—రాజకీయాలు–యుద్ధం గొడవలు— చీకటిపడటం— ఎవ రిళ్లకి వాళు వెళ్లడం.

మనిషైపుట్టేక ఇబ్బందులు అనుభ వించడం అసాధారణం కాదు. కానీ—ఇంత సానుభూతి, సహృదయం లభిస్తే ఎన్ని కష్టాల్లో కూడా ఊరట కలుగుతుంది. ఈ ఊరటే కొరవడితే మనిషి మనిషిలా బ్రతకలేడు. జీవితంలో మూడొంతులు దిగజారిపోతాడు.

బండెడు కష్టాలు రవంత సానుభూతితో సమసిపోతాయి లేదా చల్లబడతాయి. అందుకే రామారావు, జోగయ్యలు ఎప్పుడూ తమకున్న వ్యక్తిగత ఇబ్బందుల్ని ఇబ్బం దులుగా లక్ష్య పెట్టుకోలేదు. మనఃక్లేశం పొందలేదు.

తనువులు చాలించేదాకా ఒక్కలాగే సాగిపోతుంది తమ స్నేహసరళి అని పడిన గర్వం ఏమయింది. ?!.....

చెవులు అదిరిపడేలాగ గోడగడియారం పన్నెండు గంటలు కొట్టడంతో రామా రావు ఆలోచనలు ఆగిపోయేయి. భుజం మీదున్న కండువాతో నుదుటిమీద దట్టంగా పట్టిన చెమట తుడుచుకుని తలెత్తాడు. గుమ్మం దగ్గర భార్య మసక మసగ్గా కనిపించింది.

"అన్నానికి రండి."

రామారావు నెమ్మదిగా పడకకుర్చీ లోంచి లేచేడు.

"మీరివాళేమిటో సరిగ్గా తినటం లేదు." రామారావు భార్య కాంతమ్మ అన్నది అబద్ధంకాదు. అతను పెట్టిన అన్నం పెట్టినట్టే విస్తట్లో అటూ ఇటూ కెలికి నాలుగు మెతుకులు కలిపి అపోసన పట్టేశాడు. కండువాతో మూతి తుడుచుకుని గదిలోకి వచ్చేశాడు.

"మీరివాళ ఏమిటో సరిగ్గా తినటం లేదు." భార్య విసిరిన గులకరాయితో మనసు స్థిమితం తప్పి మళ్ళీ సుడులు తిరిగింది.

క్రితంరోజు బడినుంచి వస్తూ రాఘ వులి కిళ్లీ బడ్డీలో సోడా తాగుదామని పించి అటు వెళ్లేడు. సోడా అందిస్తూ రాఘవులు మరొకరితో చెబుతున్న కబురు రామారావుకి మొదట అర్థమవలేదు. తరువాత ఒకితుళ్ళి పేసింది. "ఏమిటది రాఘవులూ?" అని అడిగేడు. వాడు ఆశ్చర్యంగా చూసి "అదేంటిబాబూ! ఇంతా మీకూ తెలవదా గంటకిందేగా పోయింది ఆయన" అన్నాడు.

"ఏమిటి. ఎవరు? ఎవర్నిగురించి నువ్వం టున్నావు? సరిగ్గా చెప్పు" రామారావు గాభరాతో వాడూ కిందుమీదయిపోయేడు.

"అసలు ఉదయంనుంచి ఒంట్లో సరిగ్గా లేదట. అలాగని ఇంట్లో చెప్ప కండా ఆఫీసుకి వెళ్లేరట. మధ్యాహ్నం ఒంటిగంటా ఆముక్కాన రిక్షా కట్టించు కుని ఇంటికి వచ్చేసేరట. ఎప్పుడూలేంది ఆయన రిక్షాలో రావడంచూసి ఇంట్లో వాళ్లు అంతా పరిగెత్తుకు వచ్చేరట. రిక్షా దిగుతూనే సొమ్మసిల్లి పడిపోయిన పంతులు గార్ని ఇంట్లోకి తీసికెళ్లేరట. ఏం జ్వరమో, ఏంటో. ఇందాక మూడు గంటలికినోట్లోంచి నురగలావచ్చి వూరుకున్నాడట. మహాను భావులు పంతులుగారు. రోజూ ఈదారమ్మటే వెళ్తూ వక్కపొడి కొనుక్కు వెళ్లేవారు.

రామారావు ఆ కబురు వింటూనే ఒక్క నిముషంమాత్రం అక్కడే నిల్చొ లిగాడు.

"ఆ! ఏవిటీ.....వాడే.....వాడికే ఈ ఘోరం!" అనుకుంటూ ఒళ్లంతా చెమట్లు దిగజారుతుంటే, వూడిపోతున్నపంచెకట్టు కుని ఓచేత్తో పట్టుకుని అలాగే పరిగెత్తేడు.

ఆవీధి మొదటికి చేరుతుండగానే గొల్లు గొల్లున ఏడుపులు వినిపించేయి. దాంతో రామారావుకి కాళ్లు ముందుకి పడలేదు. బండకొయ్య వేసినట్టయింది. అతి కష్టం మీద జోగయ్యపంతులు ఇల్లు చేరు కున్నాడు. ఇంటి మెట్లు ఎక్కుతుంటే ఒళ్లు వణికింది.

ఆదృశ్యం చూస్తూనే రామారావు కొయ్యబారిపోయేడు.

జోగయ్య కళేబరాన్ని నేలమీద వో తాటాకు చాపపరచి పడుకోపెట్టేరు. వోపక్కన ఖాళీ గంగచెంబు పడివుంది. రాగాలు పెట్టేవాళ్లు పక్కన రాగాలు పెడుతుంటేకొందరలాగే పాడెకట్టే ప్రయ త్నం చేస్తున్నారు. అంతా కలగాపులగంలా వుంది. అందర్నీ చోటు చేసుకుంటూ చలనం లేని జోగయ్యపంతుల్ని చలనం ఉండీ లేనట్టున్న రామారావు సమీపించేడు.

"దారిద్ర్యంనుంచి తప్పుకున్నాడు. అదృష్టవంతుడు. మనకింకా ఎన్నాళ్లుందో శేషం" ఎవరో అన్నారు.

"కాదండీ మరీ. వెళ్లిపోయేదాకా వో పూట పని చేసుకు మరీపోయేడు. అలా

మిథ్య

అందరికీ కుదురుతుందా?"

"ఒచ్చేవా నాయనా. ఆఖరిసారి నిన్ను అడిగేడుసుమీ. 'వాడు బళ్లో ఉంటాడు. ఎందుకు అనవసరంగా కబురు పంపించి వాడిని హడల గొట్టడం అసలే గుండె నిబ్బరంలేని మనిషి' అని నీ గురించి అను కోవడం నేను విన్నాను. పోయి గంట పైగానే అయింది. నేను ముందూ, వాడు వెనకా అవవల్సింది. తారుమారు చేసేశాడు నాయనా దేవుడు" జోగయ్య తల్లి అంటూ విగ్రహంలా కూర్చున్న రామారావువేపు విస్తు పోతూ చూసింది.

రామారావుకి నమ్మకం కలగక జోగ య్యని ముట్టుకుని చూశాడు. చల్లగా తగి లింది. కళ్లలోంచి ప్రాణం పోయింది. తెరిచిన ఆ కళ్లలోకి చూసే సాహసం కలగలేదు.

వెదురుకర్రలు, తాళ్లూతెచ్చి పాడె కట్టేశారు. బిందెలతో నీళ్లుతెచ్చి శవా నికి స్నానం చేయించేరు. కొత్త పంచె చుట్ట బెట్టి నుదుటిన కుంకం పెట్టేరు. చాపతో జోగయ్యని ఎత్తి పట్టుకుని పాడెమీదికి చేర్చేరు.

కాస్సేపట్లో పాడె వెళ్లిపోతుంది— కాదు జోగయ్య వెళ్లిపోతాడు శాశ్వతంగా



తనకి సంబంధించిన, సంబంధించని వాళ్ల దగ్గర సెలవు తీసుకుని!

ముంచుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అదిమిపట్టేడు రామారావు.

సమయానికి జోగయ్య అన్నగార్లులేరు. వాళ్లు ఎక్కడో పనులు చేస్తున్నారు. కబు రంది రావడానికి రెండు రోజులు పడుతుంది. జోగయ్య తండ్రి అతనికంటే ముందే వెళ్లి పోయేడు.

పనిమీద ఆపూరువచ్చిన జోగయ్య బావ మరిది ఒకవేపు—ఆ మహారాజుని ఎత్తితే జన్మ తరిస్తుంది అంటూ తయారయిన రాఘవులు ఒకవేపు—మరొకరు— నాలుగో వేపు ఆలోచించకండానే ఎత్తుకున్నాడు రామారావు.

మరోసారి ఆ ఇంట్లోంచివచ్చే ఏడుపుల మధ్య పాడె కదిలింది.

మిత్రుణ్ని తనలో ఐక్యం చేసుకుంటోన్న అగ్నిదేవుడికి వో నమస్కారంపెట్టి ఇక ఆగ కండా అక్కడినుంచి వచ్చేశాడు రామారావు. ఎలా వచ్చేడో అతనికే తెలీదు.

అయిపోయింది జోగయ్యకీ తనకీ ఋణాను బంధం. వాడి జీవాత్మ పరమాత్మలో కలసి పోయింది.

ఇంక తను ప్రతీ సాయంకాలం కష్టం సుఖం ఎవరితో చెప్పుకోవాలి? భార్యవలన, పిల్లలవలన దొరకని మనశ్శాంతి, ఆదరణ, అనురాగం జోగయ్య సామీప్యంలో దొరుకు తాయే! అవన్నీ ఇంక ఏవి?

జోగయ్యా! నాకంటే ముందు వెళ్లి పోయేవు. పోతున్నప్పుడు కనీసం కబురేనా పంపేవుకావు. కాకిలావొచ్చి నీముందు వాలు దునే. జీవనరసం ఇంకిపోని నిన్ను కళ్లారా చూసుకుందునే. నీ నోటిమీదుగా చివరి రెండు కబుర్లూ జాగ్రత్తగా నా డైరీలో అట్టే పెట్టుకుందునే. ఎంత పనిచేశావు!

అయినా—నిన్న మధ్యాహ్నందాకా ఉన్న వాడు మరో గంటకిలేడు. తన బ్రతుక్కి మాత్రం గ్యారంటీ ఏమివుంది? అను కున్నాడు రామారావు.

* * *

అప్పుడే సంధ్యావందనం పూర్తి చేసు కుని సావిట్లోకి వచ్చిన రామారావుకి వీధి

గుమ్మంమెట్లు ఎక్కుతున్న వెంకన్నశాస్త్రులు గారు కనిపించేరు.

"రండి. రండి" ఆహ్వానించేడు.

"చిన్నబ్బాయిచేత కబురుపెట్టేరుట. ఎందుకో. నిన్న రాత్రి నేను ఇంటి కెళ్లే సరికి మావాళ్లు చెప్పేరు."

"అవునౌను. అలా పదండి గదిలోకి."

గదిలోకి వెళ్లి తలుపులు దగ్గరికి చేర వేసేడు. చాప పరిచి "కూర్చోండి"అన్నాడు. అంతకుముందే పెట్లోంచి తీసి సిద్ధంగా పెట్టుకున్న జాతకం శాస్త్రులుగారికి ఇచ్చేడు.

"మరేంలేదు. వోసారి ఇది చూసిపెడతా రని. మీకిప్పుడేంతొందర పనులులేవు కద?"

"అబ్బే. ఏంలేవు" శాస్త్రులుగారు జాతకం తీసుకుని పావుగంటసేపు చూశారు. ఏవో లెక్కలుకట్టి వేళ్లు మడిచి పైన దూలాని కేసిచూస్తూ అన్నారు మెల్లిగా.

"గురుడు కేంద్రమందున్నాడు. కుజ, శని, రాహువులు ఫరవాలేదు. అయితే....."

"అయితే?" రామారావు చప్పున అడి గేడు.

"అహా. అంతా బాగానే కనిపిస్తోంది. పోతే మూడు మాసాల్లో కొద్దిమార్పు. అంతే. ఒంట్లో కాస్త నలత చెయ్యవచ్చు"అన్నారు శాస్త్రులుగారు.

"అంతేనంటారా. ఇంకేమయినా?"

"అబ్బెబ్బే. ఘట్టిగా ఉందండీ, మీకేం? అసలు మీ జాతకంలో మీ కొడుకుల్లో ఒకళ్లు పెద్ద పేరూ డబ్బూ గడించి, తద్వారా మీరు కారులోంచి కాలుకింద మోపనక్కరలేని అమోఘమైనదశ పట్టేలా కనిపిస్తోందండీ"

"దానికేంలెండి. అంతదాకా వచ్చేసరికి నేను మీరూ ఉంటామో ఉండమోగాని."

పెంకు లెగిరిపోయినట్లు నవ్వేరు శాస్త్రులు గారు.

తీరని సందేహంతోనే తాంబూలం దక్షిణ ఇచ్చి ఆయన్ని పంపించేడు రామారావు.

"ఎందుకో శాస్త్రులుగారు వచ్చినట్లు న్నారు" అంది లోపల్నుంచి వచ్చిన కాంతమ్మ.

"ఎందుకూలేదు. తోచక వోసారి కబు రంపేను. కాఫీ చేశావా?" మాట మార్చేడు.

కాఫీ తాగి కూర్చున్న రామారావుకి శాస్త్రులుగారిమాటల్లో నమ్మకం కుదరడం లేదు. 'శాస్త్రులు బాగానే చూసేడను కుంటాను. ఎందుకు చూడడూ అయిదు రూపాయలూ పుచ్చుకుని? మారకదశవుంటే చెప్పడా? అయినా ఏమిటో గొణిగేడు. సరిగ్గా చూసేడో లేదో! ఆమధ్య కళ్ల తణికీకి ఆస్పత్రికివెళ్తే అక్కడ ఈయనా తయారయ్యేడు. ఏమిటి సంగతీ అంటే ఏముంది వో కంట్లో పువ్వేసింది. ఆరు నెలలుపోతేగాని పువ్వు ఎదగదు. ఆపరేషను చెయ్యడానికి వీల్లేదన్నాడు డాక్టరు అని చెప్పేడు కూడా!'

రామారావుగుండె గుబ గుబలాడింది. నిష్కారణంగా ఇచ్చేను అయిదు రూపా యలూ. కూర ఖర్చుకేనా పనికివచ్చు నా డబ్బు అని విచారించేడు. కాస్సేపు గడిచేక, పోతేపోయింది వెధవడబ్బు ప్రాణానికి తాపి లేకుండా పోతోందిగద! అని కుమిలి పోయేడు.

రాత్రి రామారావుకి నిద్ర సరిగ్గా పట్ట లేదు. కలలు 'కలలు అన్నీ పీడకలలే. ఏదో పెద్ద జబ్బు చేసింది'. 'ఇది చాలా ట్రబుల్ కేసు. ఆపరేషన్ చెయ్యాలి. చేస్తే ఈ వయసులో ఈయన బ్రతకడం కష్టం అంటున్నాడు' డాక్టరు.

ఆ ముక్కతో రామారావుగుండె బేజా రెత్తిపోయింది. అప్పటికప్పుడే అతనికళ్లలో మృత్యువు నీడలు కదిలేయి. రామారావుకి వచ్చినది ఈ దేశంలోఉన్న ఖరీదైన జబ్బు ల్లో ఒకటి. మా ముత్తాతకిలేదు. తాతకి, నాన్నకిలేదు. నాకేమిటీ ఖర్మం? అని విలవిల లాడేడు. మందులతో, ఫీజులతోనే సంబంధం కలిగున్న డాక్టరు కర్మం ప్రసక్తి వచ్చేసరికి వింతగాచూసి మీ ఇష్టమైతే ఆపరేషన్ చేయించుకోవచ్చు అన్నాడు. ఆప రేషన్ చేయించుకోకపోతే జబ్బు ముదిరి కుళ్లుతూ ఎలాగూ చావాలి. ఆ దుర్భర మైన చావుకంటే, డాక్టరు మెత్తని చేతుల్లో అంతకంటే మెత్తని కత్తులతోనే చస్తాను అని పీచు పీచుమంటున్న ప్రాణంతో ఆపరేషన్ బల్ల ఎక్కేడు రామారావు.

క్లోరోఫామ్ ముక్కుదగ్గర పెడుతున్న ప్పుడుఆఖరుసారిగా జోగయ్యని తరవాత వెంకన్నశాస్త్రులుగారిని తలచుకున్నాడు.

అంతే!ఒక నల్లటి తెరపడింది కళ్లముందు. తరవాత రామారావు బొందెలోంచి అతని జీవుడు నెమ్మదిగా లేచి వచ్చేశాడు. ఏడుపులు గొల్లులు, గొడవ అంతా గజిబిజిగా అయి పోయింది......రామారావు శరీరాన్ని హాస్పటల్ నుంచి ఇంటికి తెచ్చేశాక కాటికి తీసుకు పోవడానికి ఇంట్లోవాళ్లు సర్వసన్నాహాలూ చేస్తున్నారు.

రోజూ రామారావు బడినుంచి రాగానే సావిట్లో వో వాలుకుర్చీలో కూలబడేవాడు. అందులో కూర్చుంటే అతని కెంతో హాయిగా ఉంటుంది ప్రాణం. ఇవాళ రామా రావు చచ్చిపోయేడని అతన్ని నేలన వో చాప మీద పడేశారు. ఆ కుర్చీలోనేనా చేర వేస్తే వాళ్ల సొమ్మేంపోతుంది? అది తను కొనుక్కున్నదేకదా. ఇంతే ఈ మనుషులు. ఆ గాలి కాస్తా ఒంట్లోంచి పోయాక ఎవరి కెవరో?! అనుకున్నాడు ఆ గదిలోనే తిరు గాడుతున్న రామారావు జీవుడు.

"శవాన్ని ఇంట్లో ఉంచడానికి వీల్లేదు. బైట పడేయండి. అంతసేపు మీరా శవాన్ని పెట్టుకు కూర్చుంటే మాకూ పిల్లలికీ ఇవళ భోజనాలు ఉండాలనా? వద్దనా?" అని రంకెలు పెడుతున్నాడు ఆ ఇంటిగలాయన. మంచం ఎలానూలేదు. కుర్చీ అసలేలేదు. ఒంటిపై గుడ్డలు లాగే శారు. తను అద్దె ఇచ్చుకుంటున్న జాగాలో కూడా ఉండడానికి వీల్లేదుట! వాపోయాడు రామారావు జీవుడు. తరవాత అంతా గందరగోళం. మంటలమధ్య తను!......

రామారావు పెడుతున్న కేకలుతో ఉలిక్కి పడి లేచిపోయిన కాంతమ్మ పిల్లలు పరిగెత్తు కుని వచ్చేరు.

"ఏమిటి నాన్నా ఆ కేకలు?"

"ఏమిటండీ ఆ అరుపులూ? ఏవేనా పీడ కలొచ్చిందా? మిమ్మల్నేనండీ" పెళ్లాం పిల్లలూ కుదుపుతుంటే, "ఆ! ఆ! ఏమిటీ? ఏం జరిగిందీ? మీరా" అంటూ రామారావు లేచి కూర్చున్నాడు.అతని శరీరం యావత్తూ చెమటతో తడిసిపోయింది. తన చుట్టూ చేరిన అందరి మొహాల్లోకి తేరిపారచూసి

"అబ్బ! మీరేనట్రా? అయితే నేనూ....." అన్నాడు రామారావు నిట్టూర్చుతూ.

"అసలేమయింది నాన్నా?" అన్నారు పిల్లలు.

"ఏం కాలేదు(రా. ఏదో వెధవ కల" పిల్లల్ని పంపించి కాంతమ్మ అతనిదగ్గర కూర్చుని అడిగింది. "అసలేం జరిగింది చెప్పండి నాకు."

"చెప్పేందు కేముంది కాంతం?"

"అలా అనకండి. మీరేదో దాస్తున్నారు. జోగయ్యపంతులుగారు చనిపోయిన దగ్గర్నుంచీ మీరు మీరులాలేరు. నేనంతా గమనిస్తూనే ఉన్నాను. ఉదయం శాస్త్రులు గారిని రమ్మని, ఎందుకని నే నడిగితే మాట తప్పించేశారు. ఇప్పుడు......"

"కాంతం!"

"ఏమిటో మీ ప్రవర్తన నాకే బోధ పట్టంలేదు. ముప్ఫయ్యేళ్ళ కాపురంచేసినదాని దగ్గర కూడా దాచవల్సినంత గుట్టు ఏమిటి? నేనేమంత విషం అయిపోయాను మీకు?"

రామారావు వూపిరి బలంగా వదిలేడు. పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటున్న భార్యని చూస్తుంటే జాలి పుట్టుకొచ్చింది. రెండు చేతులు భార్య భుజాలమీదవేసి ఆవిడ కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"కాంతం. ఒక్కమాట చెప్పు కాంతం. నేనులేకపోతే నువ్వూ పిల్లలూ జాగ్రత్తగా, ధైర్యంగా ఉండగలరా? అహ అంటే...."

"ఏమండీ! ఏమిటండీ ఇది....ఎప్పుడూ నేను ఏది లోలోపల వూహించి భయపడ తానో అది కాస్తా నిజమయి వూరుకుం టుంది. ఇది నా ప్రారబ్ధంలా వుంది" ఏడ్చేసింది కాంతమ్మ.

రామారావు నోరు మరి పెగల్లేదు. అత నేది చెప్పామనుకున్నాడో అది చెప్పనేలేదు. అతని సందేహాలు, అనుమానాలు, ఆరాటాలు పరిష్కారం కానేలేదు.

తెల్లవారిపోయింది!

ఆరోజు సాయంకాలం బడినుంచి వచ్చి ఇంక నాలుగు రోజుల్లో తను రిటైరయి పోతాడనే వార్త భార్య కందించేడు. ఈ కబురు చెబుతూనే తను అనదల్చుకున్నది అనేశాడు. "అయిపోయింది కాంతం. ఉద్యోగంలో రిటైరయిపోయాను. యింక జీవితంలో కూడా రిటైరయిపోతే......" భార్య అరుపుతో త్రుళ్ళిపడి అక్కడితో ఆపేశాడు.

రాత్రి అన్నం తింటున్నప్పుడు మళ్ళీ అన్నాడు. "జోగయ్య ఎలాటి మనిషి! పిచ్చుకలాగ ఉండేవాడు. వాడేపోయాడు. ఏమిటో ఇదంతా చూస్తుంటే మిథ్య అని పిస్తోంది. ఇవాళ ఉన్నవాడు రేపు ఉండడు. మన మనగా ఎంత? మన బ్రతుకనగా ఎంత? ఏం గ్యారంటీ చూసుకుని మనం నిబ్బరంగా ఉండగలం చెప్పు కాంతం?"

ఏమిటి చెబుతుందావిడ? వెర్రిగా చూసింది. భార్య మవునంచూసి 'ఇదీ ఒప్పుకుంటోంది. అయినా ఈ నిజాన్ని కాదనే ధైర్యం ఎవరి కుంది?' అనుకున్నాడు రామారావు. మరి మజ్జిగ అన్నం మింగుడు పడలేదు.

రిటైరయినరోజు బళ్ళో తోటి టీచర్లందరి అభినందనల్ని పుచ్చుకుని, వాళ్ళు అభిమానంతో ఇచ్చిన చేతికర్ర, శాలువాని స్వీకరించి వచ్చేస్తూ బాగా పరిచయమున్న ఒక టీచరు దగ్గర పాతిక రూపాయలు బదు లడిగి తీసుకున్నాడు రామారావు. అటునుంచి తిన్నగా బజారుకి వెళ్ళేడు. చీకటి పడుతున్న వేళప్పుడు ఇంటిముందు ఆగిన రిక్షా, దాని లోంచి రెండు సంచీలతో పళ్ళూ, కూర గాయలూ, బట్టల పాకెట్లతో దిగిన భర్తని చూసి కాంతమ్మ తెల్లబోయింది.

"ఏమిటండీ ఇవన్నీ?" అంది.

"లోపలికి పద ముందు చెబుతాను." తెచ్చినవన్నీ లోపల పెట్టేక కాళ్ళు కడుక్కుని, బట్టలు మార్చుకుని, పడక కుర్చీలో కూర్చుని పాకెట్లు విప్పేడు.

"ఇదుగో, ఇలా వచ్చి చూడు కాంతం. ఇది నీకు చీర. బాగుందా? ఇది నాకు పంచె. ఇవి, మరేంలేదు. బత్తాయిపళ్ళు, చవగ్గా ఉన్నాయని తెచ్చేను. కాస్త రసం పిండి తెస్తావూ? పిల్లలింకా ఇంటికి రాలేదులా వుంది. సరే. అవి లోపలికి పట్టికెళ్ళు. నాకు కొంచెం ఆయాసంగావుంది. పడుకుంటాను" కళ్ళుమూసుకున్నాడు రావు రామారావు.

పొద్దున్నే స్నానంలో గుండెల్లో నెప్పి వచ్చింది. భయంపుట్టి చేతులుగుండెమీద వేసుక్కూర్చున్నాడు. తరవాత అదే తగ్గి పోయింది. ఇప్పుడు మళ్ళీ ఆయాసంగా ఉంది. అయినా....ఏమో!.... ఎవరు చెప్ప గలరు?

అసలు జోగయ్య చచ్చిపోవడంవలన తనకీ దిగుళ్ళు అన్నీ వస్తున్నాయి. లేకపోతే ఎంత నిర్విచారంగా ఉండేవాడు!

"మీదింత పిరికి గుండె ఏమిటో నా కర్థం కావటంలేదు. ఒకళ్ళు చచ్చిపోయినంత మాత్రాన మరొకళ్ళు చచ్చిపోవాలని ఉంది టండీ? ఏదో గుబులు మనసులో పెట్టు కుంటే అదే చాలు మనిషిని తినేయటానికి. అన్నీ అనర్థాలికీనూ. నామాటమీద నిషూ యించి చెప్పినట్టూ వినండి. మీరు పాడలి పోయి మమ్మల్ని పాడలగొట్టేయకండి" పళ్ళరసం ఇస్తూ అంది కాంతమ్మ.

రామారావు కోరిన ప్రకారం రాత్రి అతని కిష్టమైన వంటకాలు చేసింది కాంతమ్మ. పులిహోర, పాయసం, వంకాయమెంతికూర, ముక్కలపులుసు, అప్పడాలు—అన్నీ తృప్తిగా పెట్టించుకు తిని లేచేడు.

"రేపు లక్ష్మీపూజ చేసుకుని కట్టు కుంటానండీ" అన్న భార్యని పట్టుబట్టి 'ఇవాళరాత్రే నువ్వా చీర కట్టుకుని నాకు కనిపించాలి కాంతం' అన్నాడు గట్టిగా.

"ఏమిటో ఇన్నేళ్ళయిందిగాని ఏనాడూ నేను నీ సుఖం ఆలోచించేనుకాను. వంట గదిలో నువ్వా సెగతో అవతల్నుంచి వచ్చే కంపుతోనే చచ్చిపోతున్నావా. ఆ దొడ్డి మరమత్తు చేయిద్దాం అనుకోవడమే అవు తోంది ఎప్పటికప్పుడు. సరేసరి నోనుంచి గుడ్డముక్కకి కూడా నోచుకోలేదు నువ్వు, నన్ను కట్టుకున్నాక."

"అలా అనకండి. మీరేం తక్కువచేశారు నాకు? అబ్బాయి అందుకుంటే మనకేం

కొడవు? మీ ధోరణేవిటో విపరీతంగా ఉంది ఇవాళ."

భార్య అలా అనగానే రామారావు గుండెలు మరింత బరువెక్కాయి. అతని మనసు మళ్లీ మొదటికి వచ్చింది. నెమ్మదిగా తన బాధని వెళ్లబోసుకున్నాడు.

"ఇప్పుడేనా చెప్పు కాంతం. నేను ఒకవేళ కళ్లు మూసుకున్నాననుకో. అహ....అనుకోమంటున్నానా. అప్పుడు.....అప్పుడు నన్ను నేలప వడేయరుకదూ? ఒక్కరోజేనా ఇంట్లో ఉంచుతారా నన్ను? అప్పుడు మీరంతా మనస్ఫూర్తిగానే ఏడుస్తారా నాకోసం? లేక అదంతా నలుగురి......"

ఇప్పుడు కూడా రామారావు మాట పూర్తి కాలేదు. అతని అంతర్యంలో మరిగే లావా బయటికి పూర్తిగా ఉబకనేలేదు!

పిడుగు పడినంత భయంగా గట్టిగా అరిచింది కాంతమ్మ. రామారావు గుండెల్లో కాంతమ్మ కళ్లు జడివాన కురిశాయి ఆర్ద్రతి.'

తెలతెలవారుతుండగా తెలివివచ్చిన రామారావు తేలికపడిన మనసుతో కిటికీలోంచి నీలాకాశాన్ని చూశాడు. చిత్రం! ఆకాశంలో ఒక మబ్బు తునక కూడాలేదు. స్వచ్ఛంగా నిర్మలంగా ఉంది. తన మనసులాగే.

తను అనవసరంగా భయపడ్డాడు. శాంతం అన్నట్టు ఒకరివెంట ఒకరు చచ్చిపోవాలని ఎక్కడాలేదు. జోగయ్యకంతే ఆయువు వుంది కాబోలు. అంతా మిథ్య. ఎవరికి ఎవరూ ఏమీకారు అన్నది కూడా మిథ్యే! తన పిచ్చిగాని, తన భార్యా పిల్లలూ తన కేమీ కాకపోవటమేమిటి? వాళ్లకి తన మీద అభిమానం లేదనుకోవడం తన వెర్రి! అంతే.

ప్రాణానికి ప్రాణమైన మిత్రుడు విడిచిపోయాడనే బాధతో కృశించి ఎండిపోయిన రామారావు హృదయక్షేత్రం భార్య కన్నీటితో తడిసి ఉపశమనం పొంది తనకి 'నా' అనే వాళ్లింకా ఉన్నారన్న ఆశ మొలకెత్తింది.

తన వూహల్ని అబద్ధం అనిపించిన భార్య అక్కడ లేకపోవడంతో వెదుక్కొంటూ వంటగదిలోకి నడిచేడు రామారావు. ●